క్లుప్తంగా

సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించండి

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ తన చాంబరులో సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వసతి గృహాల విద్యార్థులకు పౌష్టికాహారం, సరైన గదులు, బాత్ రూమ్‌లు, టాయిలెట్‌లతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. నిర్మాణాలు, మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సొంత శాఖల ద్వారానే కాకుండా సీఎస్ఆర్ ఫండ్స్, ఎంపీలాడ్స్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ రాధిక, బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల కోఆర్డినేటర్ శ్రీదేవి శ్రీదేవి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సబీహా పర్వీన్, డీఈఓ శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

కల్లూరు: కర్నూలు నగరం సి. క్యాంపులోని బైక్ షోరూం ఆధ్వర్యంలో శనివారం సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీడీఓ నాగశేషాలచరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో లబ్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): వెన్నుముక సమస్యతో దీర్ఘకాలంగా బాధపడుతున్న 74 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు కర్నూలు కిమ్స్ హాస్పిటల్ స్పైన్ సర్జన్ డాక్టర్ షేక్ మన్సూర్ తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. 'అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన సా లమ్మ(74) గత కొన్ని నెలలుగా తీవ్రమైన న డుము నొప్పితో నడవలేకపోయేవారు. మూడు నెలలుగా మంచానికే పరిమితం అయ్యారు. ఈ నెల 2వ తేదీన ఆమెను కుటుంబసభ్యులు కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఆమెకు అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత వెన్నుముకలో డి 11, డి 12 భాగం వద్ద దీర్ఘకాలంగా కంప్రెషన్ (ఒత్తిడి) ప్రాక్చర్లు ఉన్నాయని తేలింది. దీంతో ఆమెకు 3వ తేదీన శస్త్రచికిత్స చేశాం. వెన్నుముకకు 19 స్క్రూలు ఉపయోగించి నిటారుగా చేశాం. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగుపడటంతో ఈ నెల 9వ తేదీన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశాం' అని వివరించారు.

కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యం


మాట్లాడుతున్న వినూషారెడ్డి

కర్నూలు కల్చరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి జరగడం లేదని, అందుకే కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గూగుల్ సంస్థపై రాజకీయ విమర్శలు చేస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ వినూషారెడ్డి విమర్శించారు. కర్నూలులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషితో గూగుల్ ఆర్టిఫిషిల్ సంస్థ భారత దేశానికి వస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌లో ఏఐ హబ్‌గా మారుతుందన్నారు. ఏపీ భవిష్యత్ అభివృద్ధి వైపు నడుస్తున్నప్పుడు విపక్షాలు దాన్ని ఆపకుండా మద్దతు ఇవ్వాలన్నారు.

అక్రమంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు

కర్నూలు (సెంట్రల్): లైసెన్స్ లేకుండా, అక్రమంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి హెచ్చరించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో బాణసంచా విక్రయాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. కేటాయించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్‌డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జీపీగా బి.కృష్ణమూర్తి నియామకం

కర్నూలు (సెంట్రల్): బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బి.కృష్ణమూర్తిని గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. కృష్ణమూర్తి జీపీగా నియమితు లు కావడంతో న్యాయవాదులు రవి గువేరా, దాశెట్టి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

దాతలకు సత్కారం

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విరా ళం చేసిన దాతలకు సత్కారం లభించింది. శనివారం ఎన్ కొంతలపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాఠశాలకు కుర్చీ లు, టేబుళ్లను విరాళంగా అందజేశారు. ఈ మేరకు దాతలను ఎంఈఓ ఓంకార్ యాదవ్ ఆధ్వరంయలో సన్మానించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో కూటమిని నిలదీద్దాం

- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి


చిత్తారి వీధిలో ఇంటింటికి వెళ్లి సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎస్వీ విజయ మనోహరి

కర్నూలు (టౌన్): పేదలకు వైద్య విద్య అందించే ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని కోటి సంతకాలతో నిలదీద్దామని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు ఎస్వీ విజయ మనోహరి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక పాతబస్తీలోని చిత్తారి గేరి వీధిలో ఇంటింటికెళ్లి కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలు, సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ప్రకారం శంకుస్థాపన చేపట్టి పనులు ప్రారంభించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెడికల్ కళాశాలల పనులు నిలిపివేసి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు చూడటం దారుణమన్నారు. జగన్నకు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే పీపీపీ విధానాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. పీపీపీని విరమించేంత వరకు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ప్రజల్లోనూ కూటమి తీరుపై తీవ్ర వ్యతిరేకత వస్తోందని, ప్రజాభిప్రాయాన్ని తీసుకొని గవర్నర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, పాటిల్ తిరుమలేశ్వర రెడ్డి, కిషన్, కంటూ, మల్లి సుమలత, రైసాబాబా, మహేంద్ర, రాము, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


దుకాణాల యజమానులతో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు అహ్మద్ అలీఖాన్


అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో కోటి సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

పెండింగ్ కరువు భత్యాలను తక్షణమే చెల్లించాలి

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ కరువు భత్యాలను తక్షణమే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. గోకారి డిమాండ్ చేశారు. శనివారం సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలను, రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించకపోవడం, అలాగే పీఆర్‌సీ కమిషన్ నియమించకపోవడం, మధ్యంతర భృతి చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. ఉద్యోగులు ఆందోళనలు చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు 57ను అనుసరించి, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జూన్ నెలలో బదిలీ అయినా రిలీవర్ లేక పాత స్థానాల్లోనే కొనసాగుతున్న ఉపాధ్యాయుల స్థానాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సుబ్బరాయుడు, శేఖర్, గోవింద్‌నాయక్, దేవదాస్, హుసేన్ మియా, ముర్తుజా వలి, ఎల్లనాగరాజు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరులోపు లక్ష్యాలు పూర్తి చేయాలి

- జిల్లా ఉద్యాన అధికారి రాజాకృష్ణారెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖ లక్ష్యాలను ఈ ఏడాది డిసెంబరులోపు పూర్తి చేసే విధంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి రాజాకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఉద్యాన అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...2026 జనవరి నుంచి ఎప్పుడైన స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఆలోపే మన లక్ష్యాలను పూర్తి చేసుకోవడంపై దృష్టి సారించాలన్నారు. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవైపై స్కీమ్‌లకు సంబంధించి వివిధ కాంపోనెంట్ల కింద లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. పండ్లతోటలకు అవకాశం ఎక్కడ ఉందో గుర్తించి లబ్ధిదారుల ఎంపికలో ఆ ప్రాంతాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సత్వరం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి గ్రౌండింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఉల్లి పంట పొలం మీద కనీసం 120 రోజులు ఉండాలని, ముందస్తుగా కోస్తుండటం వల్ల నాణ్యత కోల్పోవడం వల్ల ధరలు లభించడం లేదన్నారు. ఈ ఏడాది 500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు167 హెక్టార్లలో సాగు అయిందని తెలిపారు. సమావేశంలో సాంకేతిక ఉద్యాన అధికారి అనూష, ఉద్యాన అధికారులు శ్రీవాణి, మదన్‌మోహన్‌గౌడు, నరేష్, అపర్ణ, రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు కృషి చేద్దాం


చెట్టుకు నీరు పోస్తున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు (టౌన్): పర్యావరణానికి హాని కలిగించే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఏ.క్యాంపు మున్సిపల్ పార్కులో జిల్లా కలెక్టర్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాయు కాలుష్యం వల్ల మానవ ఆరోగ్యంతో పాటు పర్యావరణంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వం క్లీన్ ఎయిర్ అన్న థీమ్‌తో ఈ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దగ్గరి ప్రదేశాలకు వెళ్లడానికి కాలి నడక, సైక్లింగ్ అలవాటు చేసుకోవాలని సూచించారు.

స్వచ్ఛ గాలితోనే ఆరోగ్యం

కర్నూలు(అర్బన్): స్వచ్ఛమైన గాలిని తీసుకోవడం వల్లే మనిషి ఆరోగ్యం బాగుంటుందని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణ ఆంధ్రా కార్యాక్రమంలో భాగంగా 'స్వచ్ఛమైన గాలి' అనే అంశంపై జెడ్పీలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యం వల్ల ప్రజలు పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు అవసరమైన మార్గాలను అన్వేషించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, జెడ్పీ పరిపాలనాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే కార్యాక్రమానికి హాజరైన ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

కాలుష్యాన్ని అరికడదాం

కర్నూలు టౌన్: వాయు కాలుష్య నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ సైకిల్‌ను వినియోగించాలని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ పిలుపు నిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుంచి రాజ్ విహార్ వరకు క్లీన్ ఎయిర్ పేరుతో సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. మున్సిపల్ ఉద్యోగులచే కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా సైకిల్ వాడకాన్ని వినియోగిద్దామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్న రాముడు, డీసీపీ వెంకటరమణ, సీఎంఎం భాస్కర్ రెడ్డి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

వాహన వినియోగం తగ్గించాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యార్థులు విధిగా వాహన వినియోగం తగ్గిస్తే కాలుష్యాన్ని నియంత్రించిన వారవుతారని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో శనివారం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఎయిర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ పౌరులందరికీ స్వచ్ఛమైన గాలి తీసుకునే విధంగా ఉండాలంటే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్‌లు డాక్టర్ సాయిసుధీర్, డారక్టర్ సింధియా శుభప్రద, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సిందు సుబ్రమ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి


సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్ పి. విశ్వనాథ్


ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో...

స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో ఆరోగ్యంగా జీవించాలంటే వాయు కాలుష్యం లేకుండా ఉండటం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమా, కార్యాలయ ఏఓ అరుణ, డాక్టర్ నాగప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు, బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్, డెమో ప్రకాష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

హరికిషన్‌కు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం


హరికిషన్


చందమామ కథలు పుస్తకం ముఖ చిత్రం

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నిత్యానందరావు ప్రకటన విడుదల చేశారు. హరికిషన్ రచించిన 'చందమామ చెప్పిన కథలు' పుస్తకానికి ఈ పురస్కారం లభించింది. ఈనెల 29వ తేదీ హైదరాబాద్ ఎన్టీఆర్ కళా మందిరంలో సాహితీ ప్రముఖుల సమక్షంలో పురస్కారంతో పాటు రూ. 20,116 నగదు బహుమతిని అందజేయనున్నారు. హరికిషన్ సంయుక్త అక్షరాలు లేకుండా విద్యార్థుల్లో ఉత్తమ విలువలు పెంపొందించేలా అత్యంత సులభమైన శైలిలో రచించిన ఈ పుస్తకంలో ఉన్న 25 కథలు పిల్లల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వాళ్లను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయని నవ సమాజ నిర్మాణంలో భాగమవుతాయని అందుకే ఈ పురస్కారం అందజేస్తున్నట్లు న్యాయ నిర్ణేతలు ప్రకటించారు.

ఆచరణాత్మక నైపుణ్యాలు అలవర్చుకోవాలి

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ


స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): రోగులకు వైద్య విద్యార్థులు సురక్షితమైన వైద్యాన్ని అందించాలంటే ముందుగా ఆచరణాత్మకమైన నైపుణ్యాలను సురక్షిత ప్రదేశమైన ల్యాబ్‌లో నేర్చుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో మోర్గాన్ సెమినార్ హాలు, స్కిల్‌ల్యాబ్‌లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు, సిబ్బంది నిజజీవితంలో రోగులకు అందించే చికిత్సల గురించి నైపుణ్యాలను స్కిల్ ల్యాబ్‌ల్లో సాధన చేయవచ్చన్నారు. అలాగే 1985 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించడం, అనెస్థీషియా విభాగం తమ సొంత నిధులు వెచ్చించేందుకు ముందుకు రావడంతో కాలేజీ పరంగా కొంత నిధులను కేటాయించి తక్కువ కాలంలో సెమినార్ హాలు, స్కిల్ ల్యాబ్‌లు పూర్తి చేయగలిగామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ సింధియా శుభప్రద, అనెస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ డాక్టర్ రామశివనాయక్, డాక్టర్ సుధీర్ కుమార్, 1985 బ్యాచ్ పూర్వ విద్యార్థులు డాక్టర్ అంద్రూస్ జేసుదాస్, డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు ఐక్య ఉద్యమాలు

- తెలంగాణ బంద్‌కు బీసీ సంఘాల సంఘీభావం


పూలే దంపతుల విగ్రహాల వద్ద నినాదాలు చేస్తున్న బీసీ సంఘాల నేతలు

కర్నూలు(అర్బన్): చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లనే సాధించుకునేందుకు ఐక్యంగా ఉద్యమాలను చేపడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ టీ శేష ఫణి అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కోరుతూ తెలంగాణలో చేపట్టిన బంద్‌కు మద్దతుగా శనివారం స్థానిక బిర్లా సర్కిల్‌లోని పూలే దంపతుల విగ్రహాల వద్ద పలు బీసీ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని అనేక రూపాల్లో దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నా, పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 75 ఏళ్ల పాలనలో నేటికి అగ్ర వర్ణాలే అన్ని పదవులు అనుభవిస్తూ, బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. బీసీల కోటా వారికే చెందే విధంగా చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. లేని పక్షంలో బీసీల తడాఖా చూపించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన విద్యావంతుల వేదిక నాయకులు జేవీ క్రిష్టయ్య, రామశేషయ్య, రంగస్వామి, వర్మ, నాగభూషణం, శివశంకర్, మాధవస్వామి, దామోదరం రాధాక్రిష్ణ, విద్యార్థి సంఘం నాయకులు సాయికుమార్, పలు బీసీ సంఘాల నాయకులు పట్నం రాజేశ్వరి, నంది విజయలక్ష్మి, ఎం రాంబాబు, దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మికాంతయ్య, సింధు నాగేశ్వరరావు, కురువ బలరాం, డేవిడ్, బ్యాంకు రాముడు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయి పెంచాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు (సెంట్రల్): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయి పెరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కార పురోగతిపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీలు ఎక్కువగా పెండింగ్ ఉన్న శాఖలు, ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్‌సమీక్షించారు. అలాగే రీ ఓపెన్, ఆడిట్ అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. అర్జీల పరిష్కారంలో మంచి పనితీరు కనపరచిన కొతాళం, ఆస్పరి, ఆలూరు, కోసిగి, పెద్దకడుబూరు మండలాల తహసీల్దార్లతో మాట్లాడి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎక్కువ అర్జీలు పెండింగ్ ఉన్న సి.బెళగల్, ఓర్వకల్లు, కర్నూలు అర్బన్, వెల్దుర్తి తహసీల్దార్లతో మాట్లాడుతూ ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రతి రోజూ లాగిన్ ఓపెన్ చేసి, అర్జీకి సంబంధించిన అర్జీదారుతో ఓపికగా మాట్లాడాలని, వివరాలు తెలుసుకుని పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌డీఓలు ప్రతిరోజూ తహసీల్దార్లతో సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ ఓపెన్, గడువు దాటిన తర్వాత పరిష్కారం ఉండకూడదన్నారు. ప్రజలు ఎవరైనా ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వాలని, మర్యాద ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, పీజీఆర్ఎస్ నోడల్ ఆఫీసర్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి దీప్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందుబాటు ధరల్లో సోలార్ పరికరాలు


అవగాహన కల్పిస్తున్న జేసీ నీరజ

కర్నూలు(సెంట్రల్): జీఎస్టీ తగ్గడంతో తక్కువ ధరకే సోలార్ పరికరాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు కమర్షియల్ ట్యాక్స్ శాఖ జాయింట్ కమిషనర్ నీరజ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని నెడ్ క్యాప్ ఆవరణలో సోలార్ ఉత్పత్తులకు సంబంధించిన ధరలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జీఎస్టీ 2.0 సంస్కరణలతో గృహ సోలార్, రూఫ్‌టాప్, పీఎం కుసుం పథకాలకు సంబంధించి ఆరు నుంచి ఏడు వేల వరకు ధరలు తగ్గినట్లు చెప్పారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ అధికారులు వీరేంద్ర బాబు, పవన్‌కుమార్, మంత్రాలయం ఈఓపీఆర్‌డీ ఉపేంద్ర, ఎమ్మిగనూరు ఎస్‌పీడీసీఎల్ నాగేంద్ర ప్రసాదు పాల్గొన్నారు. జీఎస్టీ సంస్కరణలతో వాహనాల ధరలు బాగా తగ్గాయని డీటీసీ శాంతకుమారి పేర్కొన్నారు. నగరంలోని ద్విచక్రవాహనాల షోరూమ్‌ల్లో పనిచేసే సిబ్బందితో కలెక్టరేట్ వరకు స్కూటర్ల ర్యాలీని చేపట్టించారు. ఈ ర్యాలీని ఆమె జెండా ఊపీ ప్రారంభించారు.

శ్రీనివాసరెడ్డి సేవలు మరువలేనివి


శ్రీనివాసరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: రెవెన్యూశాఖలో పని చేస్తూ అందరి మన్ననలు పొందిన సీనియర్ అసిస్టెంట్ కాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి సేవలు మరువలేనివని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శనివారం తొగర్చేడు గ్రామంలోని మృతుడి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను, సోదరుడు కాచిరెడ్డి చంద్రమౌళేశ్వరరెడ్డిని పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ జెడ్పీటీసీ సద్దల సూ ర్యనారాయణరెడ్డి, చంద్రమౌళేశ్వరరెడ్డి, జిల్లా పంచాయరాజ్ అధ్యక్షుడు రామలక్ష్మయ్య, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జాకీర్, రమణయ్య, సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు ఉన్నారు.

విజయోత్సవ మహాసభను జయప్రదం చేయండి

కర్నూలు (అర్బన్): నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్‌లో ఈనెల 25వ తేదీన జరగబోయే ఏపీ ఎమ్మార్పీఎస్ 12వ వార్షికోత్సవం, ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిబాబు, ధరూర్ గోపి, బైరాపురం రాజు అన్నారు. శనివారం రాజ్‌విహార్ సెంటర్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఇందుకు సంబంధించి వారు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయోత్సవ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కోడుమూరు, పత్తిపాడు, సింగనమల, మడకశిర, నందికొట్కూరు ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిబాబు, ధరూర్ గోపి, బైరాపురం రాజు, రెడ్డిపోగు రాజశేఖర్, బడదల దస్తగిరి, తిరుమలేశు, మీసాల దాసురావు, ఇసాక్ తదితర ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.